నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | గురువారం 14 నవంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

రాజన్న సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే పూజలు

మంచిర్యాలటౌన్, నవంబర్ 13: వేములవాడ రాజరాజేశ్వర స్వామిని బుధవారం మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. పవిత్రమైన కార్తీకమాసంతో పాటుగా బీఆర్ఎస్ యూత్ నాయకులు, దివాకర్‌రావు తనయుడు నడిపెల్లి విజిత్‌రావు, కోడలు ఉదయశ్రీ వివాహ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. దివాకర్‌రావు వెంట సతీమణి రాజకుమారి, మనుమడు, మనువరాలు నిర్వాన్, వీక్ష ఉన్నారు.

వేములవాడ ఆలయంలో కుటుంబసభ్యులతో నడిపెల్లి దివాకర్‌రావు

రైళ్లు రద్దు..ప్రయాణికులకు ఇక్కట్లు

బెల్లంపల్లి, నవంబర్ 13 : పెద్దపల్లి జిల్లా రాఘవపూర్ రైల్వే స్టేషన్ కన్నాల రైల్వే గేట్ సమీపంలో మంగళవారం రాత్రి గూడ్సు రైలు బోగీలు పట్టాలు తప్పిన ఘటనతో పలు రైళ్లను అధికారులు బుధవారం రద్దు చేశారు. మూడు ట్రాక్‌లు చెడిపోవడంతో వాటి పునరుద్ధరణ పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టి ముమ్మరం చేస్తున్నారు. బెల్లంపల్లి మీదుగా కాగజ్‌నగర్ వైపు వెళ్లే భాగ్యనగర్, సింగరేణి, రామగిరి ప్యాసింజర్, కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, ఇంటర్ సిటీ రైళ్లను రద్దు చేసినట్లు స్థానిక అధికారులు తెలిపారు. స్టేషన్‌కు వచ్చిన ప్రయాణికులు రైళ్ల రద్దుతో ఇబ్బందులు పడ్డారు. ప్రైవేట్ వాహనాలు, ఆర్టీసీ బస్సులను ఆశ్రయించారు. గురువారం కూడా రైళ్లను పునరుద్ధరించే అవకాశం లేదని అధికారులు పేర్కొన్నారు.

ప్రయాణికులు లేక వెలవెలబోతున్న బెల్లంపల్లి రైల్వేస్టేషన్

ఆసిఫాబాద్‌లోని ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థులు(ఫైల్)

బదిలీలతోనే సరి

నామమాత్రంగా విచారణ చేపట్టి చేతులు దులుపుకున్న అధికారులు

- ఘటన జరిగిన పక్షం రోజులు తర్వాత చర్యలు తీసుకోవడంలో ఆంతర్యం ఏమిటో?
- ఇంకా లోతైన విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటున్న గిరిజనం
- గిరిజన విద్యార్థుల సంక్షేమాన్ని గాలికి వదిలేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

కుమ్రం భీం ఆసిఫాబాద్, నవంబర్ 13(నమస్తే తెలంగాణ) : వాంకిడి బాలికల ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో దాదాపు 64 మందికిపైగా విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. ప్రత్యేకంగా వేసిన కమిటీతో దాదాపు పక్షం రోజులుగా అధికారులు విచారణ జరిపారు. చివరకు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌తోపాటు ఏఎన్ఎం సేవంత, కుక్ హరిసింగ్, ఇద్దరు వర్కర్లు కమల, పెంటయ్యలను ఇతర ఆశ్రమ పాఠశాలకు బదిలీ చేశారు. ఈ మేరకు ఐటీడీఏ పీవో బదిలీ చేసినట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రమాదేవి తెలిపారు. దీంతో ఘటనపై లోతైన విచారణ జరపలేదనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. పాఠశాలకు సరఫరా అవుతున్న సరుకులు నాణ్యమైనవేనా? ఆహారం విషయంలో వార్డెన్ చేస్తున్న నిర్లక్ష్యంపై అధికారులు స్పందించలేదనే వాదనలు వినిపిస్తున్నాయి. కేవలం హెచ్ఎం, ఏఎన్ఎం, ముగ్గురు వంట మనుషులపై బదిలీ చర్యలు చేపట్టి ఘటనను కప్పిపుచ్చే ప్రయత్నాలు చేస్తున్నారే విమర్శలు వస్తున్నాయి.

గాడి తప్పుతున్న ఆశ్రమ పాఠశాల

గిరిజన విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పించే ఐటీడీఏ ఆశ్రమ పాఠశాల గాడి తప్పుతోంది. పర్యవేక్షణ ప్రశ్నార్థకంగా మారడంతో ఆహారం, చదువులతోపాటు వారి సంక్షేమంపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. వాంకిడి మండల కేంద్రంలోని బాలిక ఆశ్రమ పాఠశాలలోనే పరిస్థితి ఈ విధంగా ఉంటే ఇక మారుమూల గ్రామాల్లోని ఆశ్రమాల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. జిల్లాలో 46 ఆశ్రమ పాఠశాలల్లో దాదాపు 12 వేల మంది గిరిజన విద్యార్థులు చదువుకుంటున్నారు. గిరిజన సంక్షేమ శాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే ఆశ్రమాల్లో ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆశ్రమ నిర్వాహకులు విద్యార్థులపై శ్రద్ధ తీసుకునేలా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

యథేచ్ఛగా రేషన్ బియ్యం దందా

- అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపణలు
- గూడెంలో 20 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకుని పోలీసులకు అప్పగించిన గ్రామస్తులు

జోరుగా అక్రమ రవాణా

దండేపల్లి, నవంబర్ 13: దండేపల్లి మండలంలో రేషన్ బియ్యం అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతున్నదని ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజల నుంచి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దండేపల్లి మండలంలోని నెల్కివెంకటాపూర్, నంబాల, వెల్గనూర్ కేంద్రాలతో పాటు మరికొన్ని గ్రామాల్లో బియ్యం నిల్వ కేంద్రాలను పెట్టుకొని ఆటోలు, మినీ వ్యాన్‌లు, బొలేరో వాహనాల్లో నింపి, మహారాష్ట్ర, తదితర ప్రాంతాలకు తరలిస్తూ వ్యాపారులు లక్షల్లో అక్రమార్జన చేస్తున్నారు. అక్రమ బియ్యం వ్యాపారంపై గతంలో అధికారులకు దండేపల్లి గ్రామస్తులు వినతిపత్రాలు అందించినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రేషన్ బియ్యం అక్రమ దందాపై పోలీసు, రెవెన్యూ, పౌరసరఫరా అధికారులకు తెలిసినా చూసీ చూడనట్లుగా వదిలేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పేద, మధ్య తరగతి వర్గాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆహార భద్రత కార్డులు జారీ చేసి వారికి ఆసరాగా ఉండేందుకు రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నది. తొలుత రూ.2కిలో బియ్యం పంపిణీ చేసిన ప్రభుత్వం, ఆ తర్వాత కరోనా కష్టకాలం నుంచి రేషన్ కార్డు ఉన్న లబ్ధిదారులకు పూర్తి ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నది. పేదల ఆకలి తీర్చాలనే ఆశయంతో పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. సివిల్ సప్లై శాఖలో ఎన్ని చర్యలు తీసుకుంటున్నా రేషన్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకోలేకపోతున్నది. రేషన్ దందాను అరికట్టడానికి రేషన్ దుకాణాల్లో ఈ పాస్, బయోమెట్రిక్ విధానం అమల్లోకి వచ్చినా ఫలితం లేకుండా పోయింది. దందాను అరికట్టాల్సిన సంబంధిత అధికారులు మొక్కుబడి దాడులు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దండేపల్లి మండలంలోని నంబాల నుంచి సోమవారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న 20 క్వింటాళ్ల

గూడెం వద్ద సోమవారం రాత్రి అక్రమంగా తరలిస్తుండగా గ్రామస్తులు పట్టుకున్న రేషన్ బియ్యం వ్యాన్

పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా గూడెంలో స్థానికులతో పాటు నాయకులు మినీ వ్యాన్‌ను పట్టుకొని పోలీసులకు సమాచారం అందించారు. బియ్యం వ్యాన్‌ను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

రూ.10కు కొని...రూ.20కు అమ్మి..

రేషన్ బియ్యం దందాలో లబ్ధిదారుల నుంచే ప్రాథమికంగా తప్పుడు మార్గం ప్రారంభమవుతుందనే వాదనలు వినిపిస్తున్నాయి. సన్నబియ్యం తినడానికి అలవాటు పడ్డ రేషన్‌కార్డుదారులు తమకు వస్తున్న దొడ్డు బియ్యాన్ని ఇతరులకు విక్రయిస్తున్నారు. దళారులు ప్రతి ఇంటికీ తిరిగి రూ.10కి కొనుగోలు చేసి రూ.20కి వెల్గటూర్, కల్లెడ, మహారాష్ట్రలోని సిరొంచ, తదితర ప్రాంతాలకు రాత్రి పూట రవాణా చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో రేషన్ దుకాణాల ఎదుట లబ్ధిదారుల నుంచి నేరుగా కొనుగోలు చేసి తరలిస్తున్నారంటే ఈ దందా ఎలా సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. ప్రతి నెలా రేషన్ దుకాణాల్లో లబ్ధిదారులకు బియ్యం ఇవ్వడం ప్రారంభమైనప్పటి నుంచి దందా మొదలవుతున్నది. సంబంధిత అధికారులు బియ్యం దందాపై నిఘా పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల వాసులు కోరుతున్నారు.

సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటాం

-సంధ్యారాణి, తహసీల్దార్, దండేపల్లి

రేషన్‌బియ్యం అక్రమంగా తరలుతున్నట్లు ఇప్పటికైతే ఎలాంటి సమాచారం లేదు. సిబ్బంది తక్కువగా ఉండడంతో సమాచారం అందడం లేదు. గతంలో వీఆర్వోలు, వీఆర్ఏలు ఉన్నప్పుడు ఏ సమాచారమైనా చేరుతుండే. వారు లేకపోవడంతో కొంత సమాచారలోపం ఏర్పడింది. గ్రామాల్లో ఎవరైనా సమాచారం అందిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. రేషన్ బియ్యం సక్రమంగా లబ్ధిదారులకు అందాలని, ఎటువంటి అవకతవకలకు పాల్పడకుండా ఉండాలని మండలంలోని డీలర్లను కూడా హెచ్చరిస్తున్నాం.

కార్తీక పౌర్ణమి జాతరకు ఏర్పాట్లు ముమ్మరం

ఏర్పాట్లను పరిశీలిస్తున్న దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్

దండేపల్లి, నవంబర్13: దండేపల్లి మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో రేపు(శుక్రవారం) కార్తీక పౌర్ణమి జాతరకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. బుధవారం జాతర ఏర్పాట్లను దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ నవీన్ కుమార్ ఆలయ ఈవో శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. సుమారు 50 నుంచి 70 వేల మంది భక్తులు తరలిరానున్న దృష్ట్యా ఘాట్ రోడ్డు గుండా భక్తులు వెళ్లేందుకు బారికెడ్లు ఏర్పాటు చేశారు. గుట్టపై భాగం, కింది భాగంలో షామియానాలు ఏర్పాటు చేయనున్నారు. ఘాట్‌రోడ్డు గుండా ప్రత్యేక దర్శనం, ధర్మ దర్శనం కోసం వేర్వేరు దారులు ఏర్పాటు చేశారు. గుట్టపైకి వ్రతాలు చేసుకునేందుకు మెట్ల నుంచి ఒకటి దిగడానికి, మరొకటి వెళ్లడానికి ఏర్పాటు చేశారు. లడ్డూ ప్రసాదాలు, పులిహోరాల కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈవో తెలిపారు. ఆలయ పరిసరాల్లో వాహనాల పార్కింగ్, గోదావరి వద్ద గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు.

గోదావరి తీరంలో భక్తుల సందడి

గోదావరి ఒడ్డున పూజలు చేస్తున్న భక్తులు

దండేపల్లి, నవంబర్13 : దండేపల్లి మండలంలోని గూడెం రమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయానికి వచ్చిన భక్తులతో గోదావరి తీరం సందడిగా మారింది. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించారు. నది ఒడ్డున గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గుట్టపై ఉన్న సత్యదేవుడిని దర్శించుకున్నారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు.

వైన్స్ ఉద్యోగికి తుపాకీతో బెదిరింపులు

తుపాకీతో బెదిరిస్తున్న దుండగులు

లక్షెట్టిపేట, నవంబర్ 13 : ఈ నెల 10న లక్షెట్టిపేటలో వైన్స్ షాప్ క్యాషియర్‌ను డబ్బుల కోసం ముసుగు ధరించిన ఇద్దరు దుండగులు తుపాకీతో బెదిరించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం..లక్షెట్టిపేట పట్టణంలోని కరీంనగర్ చౌరస్తా వద్ద మారుతి వైన్స్‌లో మెరుగు లక్ష్మీరాజం క్యాషియర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి 10.30గంటలకు దుకాణం మూసేసి వచ్చిన డబ్బులను ఊత్కూర్ చౌరస్తాలో నివాసం ఉండే తన యజమాని అడ్డగూరి రమేశ్‌కు అప్పగించేందుకు బైక్‌పై వచ్చి ఇంటిముందు ఆపగానే అప్పటికే అక్కడ ముఖానికి ముసుగు ధరించి మాటు వేసి ఉన్న ఇద్దరు దుండగులు చుట్టుముట్టి లక్ష్మీరాజం మెడపై తుపాకీ పెట్టి డబ్బులు మొత్తం ఇవ్వాలని బెదిరించారు. లక్ష్మీరాజం కేకలు వేసి, యజమానిని పిలుస్తూ గేటు లోపలికి పరిగెత్తడంతో దుండగులు అక్కడి నుంచి పారిపోయారు. దుండగుల కోసం చుట్టుపక్కల వాళ్లు బైక్‌లపై తిరిగి వెతికినా దొరకలేదు. దుండగులు బొమ్మ తుపాకీతో బెదిరించినట్లు ఆదివారం సాయంత్రం లక్షెట్టిపేట పోలీస్‌స్టేషన్‌లో లక్ష్మీరాజం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి, సీసీ ఫూటేజ్ ఆధారంగా దుండగుల కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ సతీశ్ తెలిపారు.

కుళ్లిపోయిన కూరగాయలను చూపిస్తూ..

నీళ్లచారు.. కుళ్లిన కూరగాయలు

- దహెగాం కస్తూర్బా అధికారులు, సిబ్బందిపై అదనపు కలెక్టర్ దీపక్ తివారీ ఆగ్రహం
- నాణ్యమైన భోజనం పెట్టకనే విద్యార్థులు గైర్హాజరవుతున్నారని మండిపాటు
- మరోసారి జరిగితే చర్యలు తప్పవని హెచ్చరిక

కేజీబీవీలో వంటలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్‌తివారీ, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా

దహెగాం. నవంబర్ 13 : నీళ్లచారు..పుచ్చిపోయిన కూరగాయలతో కస్తూర్బా విద్యార్థులకు భోజనం అందించడం, మెనూ పాటించకపోవడంతో అధికారులు, సిబ్బందిపై కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారీ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం దహెగాం మండల కేంద్రంలోని కస్తూర్బా గురుకుల విద్యాలయాన్ని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లాతో కలిసి అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు వివరాలు పరిశీలించగా ఎస్వో సెలవులో ఉన్నారని తెలిపారు. విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. 312 మందిలో 80 మంది గైర్హాజరవడంపై ఉపాధ్యాయులను ప్రశ్నించారు. గైర్హాజరైన వారి అడ్రస్‌ను ఆ గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు పంపించి వారిని పాఠశాలకు వచ్చేలా చూడాలని ఎంపీడీవో రాజేందర్‌ను ఆదేశించారు. అనంతరం అక్కడ వండుతున్న భోజనాన్ని పరిశీలించారు. బుధవారం రోజున మెనూ ప్రకారం అన్నం, పప్పు, కూరగాయలు, రసం పెట్టాల్సి ఉండగా నీళ్లచారు, క్యాలీఫ్లవర్ వండుతుండడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మెనూ పట్టిక చూపించాలని అడుగగా సిబ్బంది చూపించకపోవడంతో వేరే విద్యాలయం నుంచి వాట్సాప్‌లో తెప్పించి చూపించారు. స్టోర్ రూమ్ వెళ్లి చూడగా ఉప్మా రవ్వ, చక్కెరకు చీమలు పట్టి ఉన్నాయి. కూరగాయలను పరిశీలించడంతో పుచ్చిపోయిన కూరగాయలు, వాడిపోయిన తోటకూర ఉండడంతో మండిపడ్డారు. గురుకులంలో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టకపోవడంతోనే విద్యార్థులు గైర్హాజరవుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. ఆర్వో ప్లాంట్ పనిచేయడం లేదని, బోరు నీళ్లు తాగుతున్నామని విద్యార్థులు తెలుపడంతో ఎందుకు మరమ్మతు చేపించలేదని సిబ్బందిని ప్రశ్నించారు. బోరు నీటిని పరీక్షించి రిపోర్టు ఇవ్వాలని ఎంపీడీవోను ఆదేశించారు. విద్యార్థులకు అందించే భోజనం, కల్పించాల్సిన వసతులపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం బీబ్రా గ్రామంలో సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించారు. సర్వే పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ దామెర కవిత, ఎంపీడీవో రాజేందర్, ఎస్ఐ కందూరి రాజు, ఇన్‌చార్జి సీఈవో నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు

ఏఎస్ఐ కుటుంబానికి ఆర్థిక సాయం

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, నవంబర్ 13: కాగజ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్లో ఏఎస్ఐ గా విధులు నిర్వహిస్తూ అక్టోబర్ 14న గుండెపోటుతో మృతి చెందిన గులాం మక్సుద్ హామద్ కుటుంబానికి పోలీస్ కో-ఆపరేటివ్ సొసైటీ తరఫున రూ.2,13,185 విలువైన చెక్కును కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు బుధవారం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో అందజేశారు. మరణించిన పోలీసుల కుటుంబాలకు పోలీసుశాఖ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ అంజన్న, జిల్లా పోలీస్ కో ఆపరేటివ్ సొసైటీ ఇన్‌చార్జి జాఫర్ ఉన్నారు.

గ్రూప్-3 పరీక్షకు ఏర్పాట్లు చేయాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, నవంబర్ 13 : ఈ నెల 17, 18 తేదీల్లో జరుగనున్న గ్రూప్ -3 పరీక్ష కోసం ఏర్పాట్లు చేయాలని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్ రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి కమిషన్ కార్యదర్శి, సభ్యులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఎస్పీలు, ప్రాంతీయ సమన్వయకర్తలతో పరీక్ష నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, అధికారులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు పనులు పరిశీలిస్తున్న ఆర్డీవో లోకేశ్వరరావు

జేసీబీతో ఆక్రమణల తొలగింపు

ప్రభుత్వ భూముల్లో ఆక్రమణల తొలగింపు

- కబ్జాలు చేసే వారిపై చర్యలు తప్పవు
- ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్‌రావు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్/ఆసిఫాబాద్ టౌన్, నవంబర్ 13: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్ఎం గార్డెన్ సమీపంలో ప్రభుత్వ స్థలంలోని నాలాను కబ్జా చేసి నిర్మించిన ఆక్రమణలను బుధవారం రెవెన్యూ అధికారులు పోలీసుల బందోబస్తు మధ్య జేసీబీలతో కూల్చివేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో లోకేశ్వరరావు మాట్లాడుతూ బీడీపీపీ, అసైన్డ్, ప్రభుత్వ భూమిని ఆక్రమించి నాలా కబ్జాపై ఫిర్యాదులు రావడంతో వెంటనే స్పందించి తొలగించినట్లు తెలిపారు. ప్రభుత్వ భూమిలో అక్రమంగా ఇండ్ల నిర్మాణం చేపట్టిన వారికి ఇప్పటికే నోటీసులు జారీ చేశామని చెప్పారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆక్రమణలను తొలగిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ భూములను ఆక్రమించినా, నాలాలపై నిర్మాణాలు చేపట్టినా, ప్రభుత్వ భూముల్లో వెంచర్లు ఏర్పాటు చేసినా కేసులు నమోదు చేస్తామని ఆర్డీవో లోకేశ్వరరావు హెచ్చరించారు. ఆయన వెంట తహసీల్దార్ రోహిత్ దేశ్ పాండే, ఇరిగేషన్ డీఈ దామోదర్, సీఐ రవీందర్, ఎస్ఐ రాజేశ్వర్ సంబంధిత అధికారులు, తదితరులు ఉన్నారు.

పారిశుధ్య నిర్వహణపై నిర్లక్ష్యం చేయొద్దు

ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, నవంబర్ 13 : జిల్లాలోని మున్సిపాలిటీల పరిధిలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని సిబ్బందిని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఆదేశించారు. బుధవారం జిల్లాలోని ఆసిఫాబాద్ మున్సిపాలిటీలోని జనకాపూర్ వార్డు, మేకల వాడలో పారిశుధ్య పనులను పరిశీలించారు. మురుగు కాలువల్లో పూడికను ఎప్పటికప్పుడు తొలగించాలని, అంతర్గత రోడ్లపై చెత్తా చెదారం లేకుండా చూడాలన్నారు. కిరాణా దుకాణం ముందు చెత్త వేసిన యజమానికి జరిమానా విధించాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, అధికారులు పాల్గొన్నారు.

'గ్రూప్-3' ని పకడ్బందీగా నిర్వహించాలి

గ్రూప్-3 పరీక్ష కోసం జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాల్లో పూర్తి స్థాయిలో వసతులు కల్పించాలని అధికారులను కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాల, జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలలో ఏర్పాటు చేస్తున్న పరీక్ష కేంద్రాలను సందర్శించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పరీక్షల ప్రాంతీయ సమన్వయకర్త లక్ష్మీనరసింహ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మురుగు కాలువను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే